# దోసిట్లో అవకాశాలు

రెడ్డిగారు అతనివంక వింతగా చూశాడు "నువ్వా కథలు జెబుతావా? నరే కానీ" అన్నారు.

సుబ్బారాజు సిగ్గుపడ్డాడు "అబ్బే. నా కతగాదు. అదే ఆయనెప్పిపొయ్యాడే అది ఓ కుర్రోడు ఆకలికేడుస్తా తిరిగి తిరిగి ఓ సత్రం అరుగుమీద స్తంభాన్ని కావిలించుకుని నిలబడి ఉన్నాట్ట. ఇంకో కుర్రోడు దారంట పోతాపోతా ఈణ్ని జూసి ఎందుకన్నాడు ఆకలేస్తుందన్నా డీడు అడిదగ్గర సంచిలో పేలాలున్నాయి పట్టెడు దీసిచ్చాడు కుర్రోడు దోసిలిబట్టాడు దోసిట్నిండా పేలాలుబోసి ఆడిదార్నాడు బొయ్యాడు ఈ కుర్రాడు స్తంభాన్ని కావలించుకున్నాడు గదా? అదేమో లావుపాటిది మోరదాచి నాలికెంత సాగదీసినా దోసిట్లో పేలాలు అందిసావలేదు. ఆడికేం పాలుపోలేదు కాసిని పేలగింజ లొగ్గేసి పిడికిళ్లు ముడిచి చేతులెనక్కి దీసుకుంటే రెండు గుప్పెళ్ళూ నోటి కందుతాయిగాని ఆడికి మనసొప్పలే ఆకలి మూలాన ఆబగా ఉన్నాడు ఆటి కేసే అలాచూస్తా ఏడుస్తా నిలబడిపోయ్యాడు గోదారోడ్డు సత్రవేమో గాలి జోరుగావుంద గాలికి పేలాలు ఎగిరిపోతున్నాయి చూస్తావుండగానే పెద్ద గాలేసి ఒక్కసారిగా అన్నీ ఎగిరి దుమ్ములోపడి కొట్టుకుపొయ్యాయి కుర్రాడు మళ్ళీ ఓ ఏడుపేడిచి ఆ స్తంభాన్నే కావలించుకొని అలాగే నిలబడిపోయాడట ..."అని కథ ఆపాడు సుబ్బారాజు

రెడ్డిగారు పకపకనవ్వారు ముందుకు వంగి సుబ్బారాజు భుజం తట్టాడు.

"బాబూ, ఈ కత జెప్పింది నువ్వేగాబట్టూరుకున్నాను. చౌదరి మరోడిచేత ఇలాటిది చెప్పించినా, అదే వచ్చి చెప్పినా ఏంజేసేవోణ్ణో నాకు తెలియదు నాగ్గావాల్సిన పేలాలు నా గుప్పిట్లోనే గాదు, జోళ్లో గూడా ఉన్నాయెప్పు చౌదరి కసలు మాట్టాడం చేతగాదు. ఎత్తిపొడుపులూ ఎత్తుపైఎత్తులూ ఏం వేస్తాడు?" *

*ముళ్ళపూడి వెంకటరమణ*